దొరయ్యదురవస్థ

రాయసం వెంకటశివుఁడుగారు, యమ్. ఏ., యల్. టి.

౧

చిన్ననాఁటి చెలికాండ్రను జూచివచ్చుట నాకు మిగుల సంతోషకరము. స్వగ్రామమందలి నా బాల్యస్నేహితులలో దొరయ్య ముఖ్యుఁడు. తన యింటిపేరు స్పష్టముగఁ జెప్పుమని బడిలో పంతులు వానిని బాధించుచుండువాఁడు. దొరయ్య మంచివాఁడు. ఇంటిపేరు సరిగా నుచ్చరింపలేక వానినాలుక తడఁబడినపుడెల్ల, పంతులవ్యాఖ్యలతో పాటు మాపరిహాసములును జెలరేఁగి వానిని జీకాకుపఱుచుచుండెడివి. ఒక్కొకప్పుడు దొరయ్య మానవ్వులకుఁ గోపించి, "నన్ను దొరయ్యా యని పిలిస్తే చాలును, మాయింటిపేరు మీ యిష్టమువచ్చినట్టు పెట్టుకోండి!" అని దైన్యమునఁ జెప్పివేయుచుండువాఁడు.

దొరయ్య గుణవంతుఁడు. అతనివంశస్థులు సజ్జనులు, స్థితిమంతులు. తీఱికసమయమున మాపంతులు మమ్ముఁ జూచి, "పిల్లలారా! ఈరోజున మనము దొరయ్యయింటిపేరు చెప్పించవలెను. ఆలస్యం చేయక చెప్పు దొరయ్యా?" అని యడుగును. స్థూలకాయముతో నంతట దొరయ్య లేచి నిలువఁబడినపుడు, మానవ్వులతో బడికప్పు ఎగిరిపోవునటులగును. పుస్తకములు మూలఁ ద్రోచి, యీమహాసమస్యాపరిష్కారమందు మే మంత కాలము గడపుదుము. దొరయ్యయుచ్చారణమందు తప్పులుపట్టుటయందు నిరక్షరకుక్షులుసయితము చాకచక్యము చాలఁగఁ గనఁబఱచుచుందురు. 'ద్వారము'అని పలుకనేరక, 'దోరం', 'దారం', 'ఉద్దారం'మున్నగు పేళ్లన్నియు దొరయ్య యేకరువుపెట్టుచుండువాఁడు. ఒకపిల్లవాని యాలోచన గైకొని, యొకనాఁడు దొరయ్య తనయింటిపేరు 'ధైర్యం' అని పలుకఁగా, మేమందఱము కడుపుబ్బునట్టుగ నవ్వితిమి.

దొరయ్య రెండుమూఁడుసంవత్సరములలో పల్లెటూరి ప్రాథమికపాఠశాలాభట్టిభద్రుఁడై, కులవృత్తియగు వ్యవసాయమునఁ బ్రవేశించి, సేద్యగాండ్రలో మిన్నయని పించుకొనెను. అదివఱకె మంచిస్థితి నుండిన యాకుటుంబమున కితని యాజమాన్యమున పాఁడిపంటలు సమృద్ధిగఁ గలిగెను. మంచిపాదుపరి యగుటచేత, దొరయ్యసొమ్ము నిలువచేసి, వడ్డీవ్యాపారముకూడ సాగించెను. ధనికుఁడనని దొరయ్యకు గర్వము లేదు; పాలుమాలిక లేదు. తన యైశ్వర్యమున కాయువుపట్టగు సేద్యము నీతఁడు పట్టువిడువక పిత్రార్జితభూములను బలపఱచుచు, క్రొత్తవానిని గొనుచు, ఆస్తిని బెంపుచేసికొనెను.

స్థితిగతు లెంత సుష్ఠుగ నున్నను, ఒక్కొకప్పుడు వానిఫల మనుభవింప మనము నోఁచుకొనకుందుము. దొరయ్య కిటీవలఁ గొన్ని తీఱని నష్టములు వాటిల్లెను. కళత్రవియోగమునకుఁ దోడుగ దృష్ట్యవరోధమును గలిగి కొంతకాలమునుండి యాతఁ డిల్లు కదలుచుండుట లేదు. చేతి కందిన కొడుకులున్నను, వారిరుచులు, ప్రజ్ఞలును వెడత్రోవఁబట్టుటచేత, దొరయ్యపొలము లిపుడు కవుళ్ల కీయఁబడినవి. వడ్డీవ్యాపారముకూడ వెనుకఁబడియుండెను. ఒక పేల! పల్లెటూరిభూస్వామి దొరయ్యయిల్లు కళకాంతులు గోలుపోయి, బావురు మనుచున్నది.

౨

స్వగ్రామము విడిచిన చాలకాలమునకు నే నచటి కేగి, నాబాల్యసహవాసునియింటికిపోయితిని. చావడిలోఁ గూర్చుండి, దొరయ్య యేదో పనిచేసికొనుచుండెను. ఎవరో తనను జూడవచ్చిరని విని, కనులచూపు లేకపోవుటచేత, ఆయత్తమైన వీనులతో నావైపున కాతఁడు మొగమెత్తెను. నాబాల్యసఖుని దృష్టి తప్పుటకు నేను ఖిన్నుఁడ నైతిని. "బాగా ఉన్నావా, దొరయ్యా!" అని నేను కుశలప్రశ్న చేయఁగా, ఒకనిముస మాతని మోము దీర్ఘాలోచనను సూచించెను. అంతట, "శాస్త్రుల్లూ!" అనుపలు కావదనగహ్వరమునుండి వెడలి

వచ్చెను. ఒక త్రుటిలో మే మిరువురమును సంభాషణా నిమగ్నుల మైతిమి. నాసమాచారము నేను సంగ్రహముగఁ జెప్పివేసితిని. తన దీర్ఘవృత్తాంత మంత దొరయ్య విప్పెను. తాను క్రొత్తభూములు కొనుట, ప్రాఁతబందుగులతో వేరగుట, ఇటీవలఁ గొన్నియిక్కట్టులపాలగుట మొదలగుసమాచారములు నాకు వినిపించినపుడు, సందర్భానుసారముగ నేను మారుపలికి, "దొరయ్యా! లోకవిశేషము లీరీతిగానే యుంటవి. సుఖదుఃఖములలో ఏది సంప్రాప్తమైనప్పుడు అది యనుభవింపక తప్పదు. ఏది యెట్లున్నను, నీకొడుకు లిద్దరూ పెద్దవాళ్లై, ప్రయోజకు లైనారుగదా!" అని పలికితిని.

దొరయ్య:—"ఆహా! మంచిప్రయోజకులే అయినారు! వాళ్ల ప్రజ్ఞయంతా కంచం మార్చి మట్టెలు చేయించడములోనే! పెద్దవాఁడు ఇంగ్లీషు వెలగబెడతాడని పట్నం పంపితే, వాఁడు డబ్బు తగలవేయడం మొదలుపెట్టాఁడు. బాగా లేదని వాఁడిచదువు చాలించాము. అంతటితో వాఁడూరకుంటేగా! తన మిడిమిడి జ్ఞానమునకు మిడిసిపడుతూ వాఁడు నేస్తులు పిలిచినారని రెండుమూఁడుసారులు మద్రాసుషికార్లు సాగించి, తలకు మించిన అప్పులు చేసుకొని వచ్చినాఁడు! చెన్నపట్నం స్నేహితులు సహాయముచేస్తారని వాఁడు మెల్లిగా సైకిలు వ్యాపారం మొదలుపెట్టినాఁడు. నాకళ్లనీళ్లు తుడిచేటందుకు వాఁడికి మొట్టమొదట స్వల్పలాభం కలిగింది. ఈ కాస్తలాభానికే నేను కేరింతాలు కొట్టినాను."

నేను:-"మెల్లి మెల్లిగా అతఁడు ఆర్జనపరుఁడైనాఁడు గదా! నీరొట్టె నేతిలోఁ బడినది—ఇంకా మూలుగుతావేమి దొరయ్యా" అని నాప్రాఁతనేస్తుని నేను మదలించితిని.

దొరయ్య:-"నీ కెప్పుడూ మాయతొందరే! పూర్తిగా విను శాస్తుల్లూ! ఈసందు చూచుకొని, భీమయ్య మోటారువర్తకంకూడా పెట్టాఁడు. చిన్నముండావాఁడుచిన్న బుచ్చుకుంటాఁడని తొలిసారినష్టాలకు నే నెట్లో కళ్లు మూసుకొన్నాను. బరితెగి వాఁ డంతట ఖిరివిగా వ్యాపారం సాగించాఁడు. అప్పటిలాభం కొంచెమైనను, ముందుసాలునుండి వందలకొద్ది లాభం వస్తుందని మావాఁడు అంచనావేసుకొన్నాఁడు. ఎక్కడ చూచినా మావాఁడిపేరు మోగిపోయింది."

నేను:-"ఇంకేమి దొరయ్యా, చెప్పవు! నీవు లక్షాధికారి వయిపోతావులే!"

దొరయ్య:—"చివరకంటా విను శాస్తుల్లూ! భీమయ్యపేరుముందు తనప్రభ అణగిపోతున్నదని మా ధర్మయ్య అప్పుడు ఎంతో తొందరపడ్డాడు. అన్న వందలు తెస్తే, తమ్ముడు వేలు లాభం తీయాలంటాడు! అన్నదగ్గరే సరుకు కొని తమ్ముడంతట బస్సులునడిపే వ్యాపారం మొదలుపెట్టినాడు—మాతాడూరురోడ్డు బస్సులన్నీ మావాడివే. తెల్లవారేటప్పటికి, పెద్దాళ్లు చిన్నాళ్లు తండోపతండాలుగా మా చిన్నాడిదర్శనానికి సిద్ధపడేవాళ్లు. పోలీసువాళ్లని మావాడు జేబులో వేసుకొన్నాడు. ఏవేళ చూచినా మా గుమ్మం ముందు 'గుంయి'మను మోటారుకూతలే. పూర్వపు పెద్దపశువుల పాక పీకివేసి, మాచిన్నాడు మోటారుషెడ్డులుకట్టించినాడు. వచ్చేపొయ్యేఉద్యోగస్తులకు మావాడు కాఫీ ఉపమాలు తయారుచేయించేవాడు. కిల్లీలు, సిగరెట్లు, సప్లైలుచేసేవాడు. ఈవిధంగా మావాళ్లిద్దరూ డబ్బు సంపాదించారు. ఐతే నేమి? మూరెడు వెళ్లడము బారెడు కుంగడం అయిపోయింది మా బ్రతుకు."

నేను:—"నీఅర్థమేమిటి దొరయ్యా?"

దొర:—"నాఅర్థం నిరర్థకమనే! వచ్చేలాభం ఎప్పటి దప్పుడు మావాళ్లు నమిలివేసేవారు. ఇంక మిగిలనదంతా, మొదటిపెట్టుబడి నష్టం. తర్వాత మార్వాడీఅప్పు పెరగడం! పొదుపు లేక, స్థితికి తగని అలవాట్లు చేసుకొని, వచ్చేసొమ్మంతా మావాళ్లు వ్యయం చేసేవాళ్లు. ఇంతలో మోటారువ్యాపారంలో వాళ్లకు పోటీదా రేర్పడ్డారు. గుగ్గిళ్లతట్టలో రెండెడ్లు ముట్టెలు పెట్టితే, రెండు కుమ్ముకొని కూలిపోవా? మావాళ్లవ్యాపారాలు క్రమంగా లాభముపోయి నష్టంలో పడ్డవి. బ్రహ్మండంమీద నాసలహా వాళ్లు విన్నారు. రెండవవాని బస్సులన్నీ పాతలై మూలపడ్డవి. పెద్దవానిసరు కెవరూ

మాచూచుశేలేదు! అప్పుడు రూపాయివస్తువు పావలా కమ్మివేశాము. చెపితే నమ్మతావో, లేదో శాస్త్రుల్లూ! ఈయిద్దరి బస్సులవ్యాపారంలో మాకు నలభై వేలరూపాయిలు నష్టంవచ్చింది. దురవస్థలో దురవస్థ! ఈసమయంలోనే నాపెద్దఅప్పుదారు డొకడు దివాలాతీశాడు. దానితో నారొక్కంపదివేలు నట్టేట గలసిపోయింది. సంసారం గుట్టు ఎవరిచెవినీ బడగూడదని నేను నోరు మూసుకొని నాసుక్షేత్ర ఖండ్రికలో ఇరవై యకరాలు అమ్మివేశాను. అవి ధరలు హెచ్చుగా నుండే మహారాజు రోజులుకావడముచేత, దానితో మాఋణం అంతా తీరిపోయింది. అయితే లాభమేమిటి? ఈగొప్పనష్టానికి గుండె పగిలి మాయింటిది మంటగలిసిపోయింది. శిరసుకు దారుణమేహంచేసి, కళ్లుపోయి, నేను మూలపడ్డాను."

3

దొరయ్యదురవస్థకు నేనెంతయు దుఃఖపడితిని. తరువాతి వృత్తాంతము చెప్పుమని నేను కోరఁగా అతఁడదియు వినుపించెను. బస్సులవ్యాపారసందర్భమున నతని కుమాళ్లకు మండలమునను, మద్రాసులోను పెద్దయుద్యోగులతోఁ బరిచయము గలిగెను. భీమయ్యాశర్మయ్యలిపుడు సూక్ష్మములో మోక్షము లభించుమార్గముకొఱకు వెదకిరి. యశోధనములు రెండును సమకూరుసాధన మిపుడు స్వజాత్యభిమానులు వారికిఁ జూపించిరి. బ్రాహ్మణేతరులకు గురుఁడు పండ్రెండింట నుండు నీప్రస్తుతకాలమందు కాఁపులపిల్లలు కాళ్లు పారఁజాఁపుకొని యింటఁ గూర్చుండుట కర్తవ్యము గాదని వారికిని గానఁబడెను. తమసంసారమున కిపుడు గొప్పతాఁకుఁడు గలిగినమాట వాస్తవమే. కాని, చాఁపచినిఁగినను, చదురంతయుండదా? సాహసమున మరలఁ గొంత పెట్టుబడి పెట్టినచో పదిమడుగులు లాభము మూటగట్టవచ్చును. చిన్ననాఁడు తమ తండ్రి తమయింటిపేరు 'ధైర్యం'వారని చెప్పియుండలేదా? ఈతరుణమున ధైర్యము వహించి, సాహసమున సొమ్ము వ్యయపఱచినచో, ఈమాఱు ధనరూపముననెగాక, కీర్తిరూపమునఁగూడ తమలాభము ద్విగుణీకృతము కాఁగలదని దొరయ్యకొడుకులు తలపోసిరి.

దొరయ్య నాతో నిట్లు పలికెను:-"మాపెద్దవాడంతట నంబరీకి ప్రయత్నించాడు. అది వచ్చినపిదప పెద్దనంబరీకోసం యెగపడ్డాడు. 'జీతం భత్యంలేని యీమాయనంబరీనౌకరీ నీ కెందుకురా నాయనా? తగవులకు ద్రవ్యనష్టాలకు కారణమాతుందేమోసుమీ! ఒకళ్లని యాచించకుండా మనపొలంపని చేసుకుంటే మళ్లీ భాగ్యదశ యెత్తుకుంటుందిరా!' అని నే నెంత బోధించినను మావాడికి నచ్చింది కాదు. మళ్లీ మావాడు మార్వాడీ మణిచ్ఛందుచేతులో బడ్డాడు. శాస్త్రుల్లూ, మన చిన్నప్పుడు చిన్న జీతాలవాళ్లే లంచాలకు చేతులు చాచే వాళ్లుగదా. ఇప్పుడో పెద్దాళ్లకు చిన్నాళ్లకు పెద్ద డబ్బుదాహంపట్టుకుంది. పెద్దనంబరీతోపాటు నాకుటుంబానికి పదివేలఋణము మళ్లీ బోణీయైయింది. తనతాహతు నిలబెట్టుకోడానికని మావాడు నెలకు నాలుగువందలు తగలబెడుతున్నాడు. ఇప్పుడేనా యీపాడునంబరీ మాని వేయరా యని నేను మొత్తుకుంటాను. 'దానికి బెట్టిన డబ్బురాబట్టుకోనియ్యవయ్యా తర్వాతే మానుకుందాము' అని నాకుమారుడు నాకు మారుచెప్పుతాడు. ఐతే యిపుడు పదిమంది పెద్దవాళ్లలో మావాడు తిరగడం నేర్చాడు. మర్యాద యిచ్చి పుచ్చుకోవడం గ్రహించాడు. నీకు నిజం చెప్పవద్దూ! మావాళ్లవల్ల మాకు శానాడబ్బు వస్తోంది. ఐతేమి? 'లంకమేత, యేటియీత'లాగున్నది మాసంసారస్థితి. ఇంకా శాసనసభలో నంబరీ మావాడు తనకు కావాలంటాడు. దానికి వేలకొద్దీ గుమ్మరించాలట! మా కీఉద్యోగా లెందుకు శాస్త్రుల్లూ? కాడి పట్టేచేతికి కలం వస్తే యేమవుతుంది? ఈయుద్యోగాలమూలాన నా పొలాలన్నీ పాడైపోయినాయి." అని దొరయ్య విచారించెను.

సొమ్మువిషయమున తమసంసారస్థితి చక్కపడుచున్నది గదా యని నే ననఁగా, "ఏమి చెప్పను శాస్త్రుల్లుబావా! వచ్చేడబ్బు దస్కం యెప్పడి దప్పుడు నమిలేస్తున్నాము. ఒకమూల మహారణ్యములాగ అప్పు పెరిగి పోతూవున్నది!" అని దొరయ్య మొఱపెట్టెను.

రెండవవానిసంగతి యడిగినపుడు దొరయ్య యిట్లు చెప్పెను:—"అన్నయ్యను మించిన ప్రజ్ఞ కనబరిస్తేనే

గాని తమ్మయ్యకు సంతుష్టిలేదు. కష్టపడకుండా ధనరాసులు పోగుజేసికోవలె నంటాడు వీడు. తెస్తున్నాడు, తగలేస్తున్నాడు."

ఇతఁడు చేయునుద్యోగ మేమని నే నడిగినపుడు, "ఎందు కడిగి నాపుండు మళ్లీ మళ్లీ రేపుతావు శాస్తుల్లూ! వెనక నాఅప్పు రాబట్టుకొనడానికి తనభూమంతా నేను వేలం వేయించి అమ్మించిన దీక్షితులు అనేదుష్టగ్రహము, ఇప్పుడు మారెండవవానిని పట్టుకొని, వాడికి గుండెకాయ యైపోయినాడు. మావాడికి వీడు నేర్పనిదుర్మార్గ మేమీ లేదు. వీడు నాపాలిటిపరమశత్రువై, తనకు నే జేసిన పరాభవానికి పదిరెట్లు హాని చేసి, మాసంసారంమీద పగదీర్చుకుంటూవున్నట్టు కనబడుచున్నది. అన్నిటి కేమి గాని, శాస్తుల్లూ, యెక్కడేనా బ్రాహ్మనింట్లో పుట్టిన వాడినోటికి మద్యమాంసాదు లేలా రుచిస్తవయ్యా? ఈ ముండావాడి సావాసాన మావాడికి పట్టుపడని పాడు చేష్టలు లేవు." అని దొరయ్య కంట తడిపెట్టికొని, "ఎవరూ లేరు గదా, ఇక్కడ!" యని యడిగి, నా చెవిలో కొన్నిమాటలు చెప్పి, గోలుగోలున నేడ్చెను.

దొరయ్యవలన వీడుకోలంది, రాత్రి చీఁకటిలో నే నింటికి వచ్చునపుడు, పాలవంటి తమవంశపు మరియాదలు నీటఁ గలిపి, సిరిసంపదలతోఁ జెన్నొందు సంసారము నప్పులపాలుచేసిన దొరయ్యకుమారులను గురించి నేను దలపోసితిని. నే నెక్కువగ వెత నొందినది, లంచము లిచ్చిపుచ్చుకొనుచు గౌరవోద్యోగములు సాధించి సాగించెడి పెద్దకొడుకును గురించియో, జూదమె జీవనోపాధిగఁ జేకొని దుర్వ్యసనములపాలైన రెండవవానినిగురించియో, కుమాళ్లదుర్వ్యయములవలన లక్ష రూపాయిల యప్పు పెరఁగి తనయాస్తి నంతటిని గోలుపోవ సిద్ధమై చక్షువులకు మేఘపటలములు, మనశ్చక్షువునకు దుఃఖపటలమును గ్రమ్మ, దారితెన్నులు గానరాక, అంధకారమునఁ జెరలాడెడి వృద్ధజనకునిగురించియో, నాకు బాగుగ జ్ఞాపకము లేదు.

కృషీవలా!

పరుచూరి భువనేశ్వరీ దేవిగారు

మేఘమాలికలలో మెఱుఁగు లేఁదళుకుతోఁ దొలుతగాఁ జిఱునవ్వు తొలకరించె
పోతుటీఁగలలోని పుటుకతేనియతోడ మురువుగా తొలిపల్కు లురిమి కురిసె
ఫణిఫణావళులలో మిణుకారుమణితోడ దీటుగా దివ్య జ్యోతిస్సు గారె
కాళరాత్రులలోని బాలేందులేఖతో హాయిగా నార్ద్రిత్వ మావహిలఁగ
మండుకడుపులు చల్లార్పఁ బండుపంట - జైలుపాలముల నీ పెంపఁ బెరఁగినట్టి
స్వేచ్ఛ యనునారు గొని రాఁగ వెడలు మోయి-విశ్వలీలాకృషీవలా వెలుఁగు మాలి.